# పాజిటివ్ కథ

## వై. వసంత

"గుడ్ మార్నింగ్ సార్! అటెండెన్స్ రిజిష్టర్ సూపరింటెండెంట్ గారి టేబుల్ దగ్గరకు వెళ్ళిపోయిందా" అంటూ సాధారణంగా అదే సమయానికి వినిపించే స్వరానికి తలపైకెత్తి కళ్ళజోడు ముక్కు మీదకు జారిపోగా పైనుంచి చూశాడు యాభైఅయిదు సంవత్సరాల సెక్షనాఫీసర్.

ఎదురుగా భుజానికి హ్యాండ్‌బ్యాగ్‌తో చేతి వాచీ చూసుకుంటూ నిలుచుని వుంది చందన.

"సారీ చందనా! నువ్వు వచ్చేసావా? నువ్వు వస్తావని ఇప్పటి వరకూ చూసి ఇంక రావేమోనని, ఇప్పుడే సూపరింటెండెంట్‌గారు అడిగితే పంపించాను."

"ఫర్వాలేదండి. మీరు సారీ చెప్పడం ఎందుకు. నేనే లేటుగా వచ్చాను" అని బాగ్ తన టేబుల్ మీద పెట్టి, సూపరింటెండెంట్ చూసే చూపులను ఎలా ఎదుర్కోవాలా అని భయపడుతూ ఆయన రూమ్‌లోకి నడిచింది.

"నమస్తే సార్"

"నమస్తే" అంటూ ఏమిటి అన్నట్లు చూశాడు సూపరింటెండెంట్ ఏకాంబరం.

"సారీ సర్! కొంచెం లేటయింది" అంటూ నీళ్ళు నమిలింది.

"మీరు ఈ సెక్షన్‌కు వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. రోజూ లేటుగా వస్తున్నట్టున్నారు" అన్నాడు.

"లేదు సర్! ఈరోజే కొంచెం లేటయింది" అంది.


"సరే! రేపటి నుంచి టైముకు రావడానికి ప్రయత్నించండి" అంటూ రిజిష్టర్ ఆమె ముందుకు తోశాడు.

సంతకం చేసి 'థాంక్యూ సర్' అని వచ్చి తన సీటులో ఒక్క క్షణం కళ్ళు మూసుకొని కూర్చుంది చందన.

"హమ్మయ్య ఈరోజుకు ఆఫీసుకు రాగలిగాను" అంది తన నేస్తమైన మనసుతో.

ఒక్క క్షణం సేదదీరి టేబుల్‌లో నుంచి ఫైల్స్ తీసి కంప్యూటర్ ఆన్ చేసింది- "నిన్న మిగిలిన బ్యాలెన్స్ వర్క్ తొందరగా పూర్తిచేయాలి. లేకపోతే మళ్ళీ సూపరింటెండెంట్ చేత మాటపడాలి" అనుకుంటూ.

** ** **



సాయంత్రం ఆఫీసు అయ్యాక కెనెటిక్ మీద బయల్దేరింది చందన.

హెచ్ఐవి పాజిటివర్స్ క్లబ్ అన్న బోర్డు వున్న భవనంలోకి వెళ్ళి కెనెటిక్‌ను ఆపింది.

బండి స్టాండ్ వేసి, తలపైనుంచి హెల్మెట్ తీసి బండికి వున్న సేఫ్టీ లాక్‌కి తగిలించి, తిరిగి తాళం వేసింది.

తలతిప్పి ఆ ప్రాంగణాన్ని నిశితంగా చూసింది. అక్కడంతా "ఎయిడ్స్ గురించి తెలుసుకుందాం నివారిద్దాం" అనే బ్యానర్లు కట్టి ఉన్నాయి.

హెచ్ఐవి పాజిటివ్ వున్నవారిని సమాజంలో ఎదురయ్యే ఇబ్బందుల నుంచి కాపాడటం ఈ సంస్థ ముఖ్యోద్దేశం. తొలుత ఈ సంస్థకి "ఎయిడ్స్ బాధితుల సేవాశ్రమం" అనే పేరుండేది. కానీ ఈ సంస్థలో చేరాక పేరు మార్చాల్సిందిగా చందన పట్టుబట్టింది. 'బాధితులు' అనడం ద్వారా వారిని మరింత బాధకు లోను చేసి, న్యూనత పరిచినట్టు ఉంటుందని సంస్థ మీటింగ్స్‌లో వాదించింది. హెచ్ఐవి పాజిటివ్ వచ్చిన వారి గురించి మాట్లాడేటప్పుడు వాడే భాష వారి మనసుకి నొప్పి కలిగించని రీతిలో ఉండాలందామె. ఆమె మాటల్లోని ఆవేదన గమనించాక సంస్థ పేరును 'హెచ్ఐవి పాజిటివర్స్ క్లబ్'గా మార్చారు.

హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్ సోకిందని అనుమానంతో భయపడేవారికి ముందుగా అవసరమైన పరీక్షలు నిర్వహించి ఇన్‌ఫెక్షన్‌ను నిర్ధారిస్తుంది. స్క్రీనింగ్ పద్ధతుల ద్వారా పరీక్షించిన తరువాత పాజిటివ్ వచ్చినవారిని తప్పనిసరిగా వెస్టర్న్ బ్లాట్ లేదా యాంటిజెన్ డిటెక్షన్ పరీక్షలు, పిసిఆర్ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు. వ్యాధిని అధ్యయనం చేయడానికి, చికిత్సా ప్రణాళికను రూపొందించడానికి అవసరమయిన వ్యాధి తాలూకు ప్రతిదశ నిర్వచనం సిడి4 కౌంట్, లక్షణ సముదాయాలను అనుసరించి నిర్ణయిస్తాయి. ఇవన్నీ ఈ సంస్థ స్వచ్ఛందంగా అందించే సేవలు.

ఎయిడ్స్ సోకిందని, తాము తొందరలో చనిపోవడం ఖాయమని హెచ్ఐవి పాజిటివ్ నిర్ధారణ అయినవారందరిలోనూ మానసిక స్థైర్యాన్ని ప్రోది చేయాలనే సంకల్పంతోనే ఈ సంస్థలో వాలెంటీర్‌గా చేరింది చందన. మూడు సంవత్సరాల నుంచి ఆఫీసుకు వచ్చేముందు, సాయంత్రం ఇంటికి వెళ్ళేముందు ఇక్కడకు వస్తోంది. రాత్రి తొమ్మిది, పది గంటల వరకు ఇక్కడివారికి తనవంతు సహకారాన్ని అందించడం చందన దినచర్యలో భాగమయింది.

తన అక్క పడిన బాధలు, ఒత్తిళ్ళు ఎవరూ అనుభవించకూడదని, తన జీవితంలో పేరుకుపోయిన నైరాశ్యాన్ని తొలగించుకోవడానికి చందన ఎందుకున్న మార్గమిది.

అక్కడ వున్నవాళ్ళు చందన రాకకోసం ఎదురు చూస్తుంటారు.

పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళు కూడా ఆత్మీయతతో తమకు సేవ చేసే చందనను 'అక్కా' అని పిలుస్తారు.

వారి సందేహాల్ని, భయాల్ని ఏకరువు పెడతారు. ఆమె చెప్పే మాటలు, అనునయ వాక్యాలు వారికి ఉపశమనాన్నిస్తాయి. సాంత్వన చేకూరుస్తాయి.

చందన ఎన్నివిధాలుగా చెప్పినా సరే హెచ్ఐవి పాజిటివ్ ఉన్న ముప్ఫై సంవత్సరాల శిల్ప ధైర్యంగా ఉండలేకపోతోంది.

చందన ఉదయం, సాయంత్రం వచ్చిన వెంటనే ముందుగా ఈమధ్యనే వచ్చిన శిల్ప దగ్గరకే వెళుతుంది.

ఆరోజు కూడా శిల్ప దగ్గరకు వెళ్ళింది చందన.

మోకాళ్ళపై గెడ్డం ఆనించి కూర్చుని ఉంది శిల్ప. ఆమె చెంపలపై కన్నీటి చారలు చాలాసేపటి నుంచి ఆమె బాధపడుతోందని చెప్పకనే చెబుతున్నాయి.

"ఏమిటి శిల్పా! నువ్వు చిన్నపిల్లవు కాదు కదా! కొంచెం ధైర్యంగా ఉండాలి. నీకు, నీ కడుపులో పాపకు ఏమీ కాదు" అంది చందన.

"నాకు భయంగా ఉంది అక్కా. నా కడుపులో బిడ్డ ఆడపిల్లయితే అది ఎన్ని అగచాట్లు పడుతుందోనని భయమేస్తోంది. ఊహించాలంటేనే చాలా భయంగా వుంది. నాకు హెచ్ఐవి సోకిందని తెలియగానే మా వాళ్ళు నన్ను వెలి వేశారు. ఒకవేళ నేను చనిపోతే నా బిడ్డ గతేంటి? దాన్ని ఈలోకంలోకి తెచ్చి యాతనకు లోను చేయడం కన్నా నేనిప్పుడే చని పోతే..." అంటూ దుఃఖాన్ని ఆపుకోలేక, మాట పూర్తి చేయలేక వెక్కిళ్ళు పెడుతున్న శిల్పని దగ్గరికి తీసుకుంది చందన.

ఆమె చుట్టూ చేతులేసి దగ్గరికి లాక్కుంటూ "శిల్పా బి బ్రేవ్... నువ్వు డిగ్రీ చదువుకున్నావు... ఇంతలో బేలగా అయిపోతే ఎలా? నేనున్నాను కదా... నీకేం కాదు, నీ బిడ్డకీ ఏం కాదు" అంది.

చందన మాటలు శిల్పకి ఊరడింపుని ఇచ్చాయి.

కానీ ఆ కళ్ళల్లో బెరుకు, దిగులు అలానే ఉన్నాయి.

"నాకు కూడా అందరి అమ్మాయిలలాగే ఎన్నో ఆశలుండేవి. కానీ ఇప్పుడు అంతా నిరాశగా వుంది. ఎన్ని కష్టాలు వచ్చినా మనోనిబ్బరంతో ఉండాలని అందరూ చెప్తారు. నేనూ అలా వుండటానికే ప్రయత్నించాను. అది ఎంత కష్టమో అనుభవించినవాళ్ళకే తెలుస్తుంది. నాలాంటి బాధలు పగవారికి కూడా రాకూడదు" అంటూ మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకుంది శిల్ప.

"ఆమె అంతరంగంలో ఇంత అలజడి ఉందా?" అనుకుంది చందన.

"నేను చచ్చిపోతానన్న భయంకన్నా, నాబిడ్డ పరిస్థితి ఏమిటి? సమాజంలో ఎలా బతుకుతుంది? అన్న ఆలోచనలే నన్ను నిలవనీయడంలేదు"

"నువ్వు ధైర్యంగా ఉన్నంతకాలం నీకు, నీ బిడ్డకు ఏమీకాదు. ఒకవేళ నీకేమయినా అయినా మా రేష్మను పెంచుతున్నట్టే నీ బిడ్డను కూడా నేనే పెంచుతాను" అంది చందన.

"రేష్మ ఎవరు?" అంది శిల్ప కళ్ళు తుడుచుకుంటూ.

"మా అక్క కూతురు. మేమందరం ఉన్నా తల్లిలేని అనాథగా పెరుగుతోంది."

"మీ అక్కకు ఏమైంది?"

"దాదాపు నీ జీవితం లాంటిదే మా అక్క జీవితం."

వివరంగా చెప్పమన్నట్టు చూసింది శిల్ప.

విషాదభరితమైన ఆ గతం తలుచుకోవాలంటే చందనకి కూడా కష్టంగానే వుంది.

** ** **

"నాకు కూడా అందరి అమ్మాయిలలాగే ఎన్నో ఆశలుండేవి. కానీ ఇప్పుడు అంతా నిరాశగా వుంది. ఎన్ని కష్టాలు వచ్చినా మనోనిబ్బరంతో ఉండాలని అందరూ చెప్తారు. నేనూ అలా వుండటానికే ప్రయత్నించాను. అది ఎంత కష్టమో అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. నాలాంటి బాధలు పగవారికి కూడా రాకూడదు" అంటూ మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకుంది శిల్ప.



వైశాలికి వివేక్‌తో పెళ్ళి సంబంధం కుదిరింది.

పేర్లు, జాతకాలు కలిశాయి, ఈడుజోడు బాగుందని వివేక్‌కి ఇచ్చి పెళ్ళి చేశారు.

పెళ్ళి అయిన రెండు సంవత్సరాలకు వివేక్ తరచుగా అస్వస్థతకు గురయ్యేవాడు. జ్వరం, విరోచనాలు, కాళ్ళనొప్పులు లాంటి అనారోగ్య సమస్యలతో బాధపడేవాడు. ఎన్ని మందులువాడినా బూడిదలో పోసిన పన్నీరే అయ్యాయి. అనారోగ్యానికి కారణం హెచ్ఐవి పాజిటివ్ అని తేల్చారు.

పెళ్ళినాటికే అతనికి హెచ్ఐవి పాజిటివ్ ఉందని, ఆ విషయం చెప్పకుండా పెళ్ళి చేశారని అంతా అయిపోయాక తెలిసింది. అప్పటికే సమయం మించిపోయిందన్నారు డాక్టర్లు. అతని బాధలు తగ్గలేదు. ఆరోగ్యం కుదుట పడలేదు.

వివేక్‌ని తీసుకెళ్ళని గుడిలేదు, ఆసుపత్రి లేదు.

"మా తెలియనితనం వల్ల నీ జీవితాన్ని నాశనం చేశాం కదే. లోకం నిన్ను నిలవనిస్తుందా?" అంటూ బాధపడింది వైశాలి తల్లి.

"ఏ దేముడైనా కరుణించడా, ఏ పూజలైనా ఫలించవా అన్న ఆశతోనే బతుకుతున్నాను. నన్ను బతికిస్తోంది. ఎవరయినా దీనిని నా బలహీనత అనుకున్నా, భ్రమ అనుకున్నా పట్టించుకోను. మీరు కూడా బాధపడకండి" అంది వైశాలి.

"ఎందుకయినా మంచిది నువ్వు కూడా ఒకసారి పరీక్ష చేయించుకో" అన్నారు ఆమె తల్లిదండ్రులు కూతురుకు వచ్చిన కష్టానికి బాధపడుతూ.

వైశాలి పరీక్ష చేయించుకుంది.

అప్పటికే గర్భవతి అయిన తనకు హెచ్ఐవి పాజిటివ్ ఉందని తెలియడంతో ఆమె మాతృహృదయం తల్లడిల్లింది. పుట్టబోయే తన బిడ్డకు కూడా అది సోకుతుందా అనే వేదన మొదలయింది.

"కడుపులో వున్న బిడ్డకు కూడా సోకే ప్రమాదం ఉంది. అబార్షన్ చేయించుకో" అని సలహా ఇచ్చారు సన్నిహితులు.

ఆరునెలల లోపలే వివేక్‌ను మృత్యువు కబళించింది.

"రోట్లో తలపెట్టి రోకటి పోటుకు భయపడితే ఎలా" అన్నట్లు వుంది ఆమె మానసిక స్థితి.

శిలలను సహితం కరిగించి వేయగల ఆమె ఆవేదనా తాపానికి కుంగి పోయారు కుటుంబ సభ్యులు.

"నన్నెవరేమనుకున్నా సరే! నా దరిదాపులకు ఎవరు రాకపోయినా సరే! నేను నాకోసం జీవించాలి. కడుపులో పెరుగుతున్న పాప కోసం బతకాలి. అందుకే నన్ను నేను సంతోషంగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తాను. కడుపులోవున్న నా పాప ఆరోగ్యంగా పెరగాలి. అంతేకానీ ఇతరుల గురించి ఆలోచించే స్థితిలో లేదు నా మానసిక స్థితి" ఈవిధంగా సాగుతున్నాయి వైశాలి ఆలోచనలు.

"యస్! అధైర్యపడను. తన దుస్థితి తన పాపకు సోకకుండా చూసుకుంటాను" అని గట్టి నిర్ణయం తీసుకుంది.

** ** **

వైశాలి తిరగని ఆసుపత్రి లేదు. ఆమెకు హెచ్ఐవి పాజిటివ్ ఉందని, అది మిగిలిన పేషెంట్లకు కూడా అంటుకుంటుందన్న సంశయంతో కొందరు డాక్టర్లు వైద్యం చేయడానికి నిరాకరించారు.



"హెచ్ఐవి పాజిటివ్ అని నిర్ధారణ అయినప్పుడు ఎప్పటికయినా ప్రాణాలు పోవడం ఖాయమే కావచ్చు. అంతమాత్రాన బతికినన్ని రోజులు వారిని మానసికంగా హింసించి చంపాలా? అది అన్యాయం. సమాజం నుంచి ఇటువంటి తిరస్కారాన్ని ఎదుర్కోవలసి రావడం తన దౌర్భల్యం. ఈ సువిశాల నగరంలో తనను, తన బిడ్డను కాపాడేవారే కరువయ్యారా?" ఇలా పరిపరివిధాల ఆలోచిస్తోంది వైశాలి.

చివరి ప్రయత్నంగా ఒక ఆసుపత్రికి ఆటోలో బయల్దేరింది. రోడ్డు పక్కన ఉన్న ఒక దేవాలయం కనిపించింది. అప్రయత్నంగా చేతులు జోడించి దణ్ణం పెట్టుకుంది. ఆ గుడిపై ఉన్న దేవుడు తనను చూసి నవ్వుతున్నట్టు, "ఎందుకమ్మా! బతకాలన్న ఇంత పిచ్చి కోరిక" అని అడిగినట్టుగా అనిపించింది.

ఎంత నిరాశ చెందినా మనసులో ఎక్కడో చిన్న ఆశ. "ఇప్పుడు వెళ్ళే డాక్టర్ కూడా వైద్యం చేయడానికి నిరాకరిస్తే. ఏమో! ఒకసారి అడిగి చూద్దాం!" అనుకుంది.

"నా కోరిక తీరుతుందనే నమ్మకం నాకుంది. ఆ నమ్మకమే, ఆ ధైర్యమే నాకు శ్రీరామరక్ష. ఒకవేళ భగవంతుడు కూడా నా ప్రార్థనని పెడచెవిన పెడితే ఇహ అప్పుడు చేయగలిగేది మాత్రం ఏముంటుంది. అయినా ముందుగానే వ్యతిరేక ఆలోచనలతో మనసును బాధపెట్టడం ఎందుకు. ఏ పనయినా మంచి ఫలితాన్ని ఇస్తుందనే ఆత్మవిశ్వాసంతోనే మొదలుపెట్టాలి" అనుకుంటూ ఆసుపత్రి దగ్గర ఆటో దిగి లోపలకు వెళ్ళింది.

వైశాలి పాలిటి దైవం అయింది డాక్టర్ నీలిమ.

వైశాలి రిపోర్టులుచూసి, ఒక్క క్షణం తర్వాత -

"అధైర్యపడకు. నీ పాపకు ఏమీకాదు. పుట్టబోయే పాపకు హెచ్ఐవి పాజిటివ్ రావడానికి యాభై శాతం అవకాశాలు ఉన్నాయి. నీ అదృష్టం, నీ పాప అదృష్టం ఎలా వుందో చూద్దాం. నిన్ను కాపాడటానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను"అని ధైర్యం చెప్పింది వైశాలికి.

డాక్టరు మాటలు విన్న వైశాలి ఆనందంతో కొంచెం సేపు తేరుకోలేకపోయింది.

"థాంక్యూ డాక్టర్! ఎవరూ చేయలేని సాహసం మీరు చేస్తున్నారు. ఇంతవరకు నేను వెళ్ళని నర్సింగ్‌హోం లేదు. ఎవరూ నాకు వైద్యం చేయడానికి అంగీకరించలేదు. నావల్ల మీకు ఏమయినా సమస్యలు వస్తాయేమో" అంది.

"ఏం ఫర్వాలేదు. అన్నీ నేను చూసుకుంటాను కదా!" అంది.

"నా పాప తల్లీ, తండ్రీలేని అనాథ అయిపోతుందేమోనని భయంగా వుంది" అంది వైశాలి.

"హెచ్ఐవి పాజిటివ్ అని నిర్ధారణ అయిన పది సంవత్సరాల వరకు నీకేమీ కాదు. ఈ లోపు నువ్వు ధైర్యంగా నిలబడి, నీలో రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. అందుకు తగిన మార్గాలను నేను చెబుతాను. నువ్వు ఎంత ధైర్యంగా వుంటే అంత ఎక్కువ కాలం బతుకుతావు" అంది డాక్టర్.

తన పాప జీవితం తనలా కాకూడదనుకుంది. తన మాతృత్వాన్ని, పిల్లకు తన పాలు తాగించాలన్న తపన, కోరికలను మనసులోనే అణచివేసుకుంది. ఎన్నో కష్టాలు, విమర్శలు ఎదుర్కొని కన్న తన బిడ్డను కనీసం ముద్దు కూడా పెట్టుకోలేని తన దీనస్థితికి బాధపడింది. తన కోరికలకన్నా పాప ఆరోగ్యం ముఖ్యం అనుకుంది. కోరికల్ని సమాధిచేసింది.

వైశాలి ఆరోగ్యం నార్మల్‌గానే వుంది. వ్యాధులేమీ రాకండా 'యాంటీ రిట్రో వైరల్ డ్రగ్స్'ను ఇచ్చింది. ఫ్లోఫ్లాక్స్ ట్రీట్‌మెంట్ చేసింది. వైశాలి తినవలసిన న్యూట్రేషన్ ఫుడ్‌ను, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పింది. ప్రతి వారం చెకప్‌కు రమ్మంది.

డాక్టర్, కుటుంబ సభ్యుల సహకారంతో వైశాలి ఆరోగ్యంగానే ఉంది.

"నార్మల్ డెలివరీ అయ్యేవరకు ఎదురు చూడకుండా సిజేరియన్ చేస్తే మంచిది" అంది డా. నీలిమ.

"మీ ఇష్టం".

ఒక మంచిరోజు ఆపరేషన్ చేసి పాపాయిని బయటకు తీసింది నీలిమ.

పాపకు రక్త పరీక్షలు చేయించింది. దేవుడి దయవల్ల పాప ఆరోగ్యంగా ఉంది.

"పాప ఆరోగ్యంగా పెరగాలంటే నువ్వు పాలు ఇవ్వకూడదు" అంది.

"సరే" అంది బాధను దిగమింగుకుంటూ.

తన పాప జీవితం తనలా కాకూడదనుకుంది. తన మాతృత్వాన్ని, పిల్లకు తన పాలు తాగించాలన్న తపన, కోరికలను మనసులోనే అణచివేసుకుంది.

ఎన్నో కష్టాలు, విమర్శలు ఎదుర్కొని కన్న తన బిడ్డను కనీసం ముద్దు కూడా పెట్టుకోలేని తన దీనస్థితికి బాధపడింది. తన కోరికల కన్నా పాప ఆరోగ్యం ముఖ్యం అనుకుంది. కోరికల్ని సమాధిచేసింది.

సాధ్యమయినంత వరకు పాప పోషణ వైశాలి ఆఖరి చెల్లెలు చందనే చూసుకొనేది.

తన అభిభాషణలను డైరీలలో పొందుపరచింది- తన పాప పెద్ద అయ్యాక వాటిని చదవాలి అనుకుంటూ.

పాపకు 'రేష్మ' అని పేరు పెట్టుకుంది.

రేష్మ పెద్ద అయ్యేవరకయినా తాను బతికి ఉండాలి అనుకుంది. తనలో రోగనిరోధక శక్తితగ్గకుండా, ఇన్‌ఫెక్షన్స్ సోకకుండా ఎన్ని చర్యలు తీసుకోవాలో అన్నీ తీసుకుంటూనే ఉంది వైశాలి.

** ** **

రేష్మకు ఎనిమిదేళ్ళు వచ్చేసరికి వైశాలి ఆరోగ్యం క్షీణించసాగింది.

మందులు పనిచేయడంలేదు. ఒక్కొక్క ఇన్‌ఫెక్షనే వస్తోంది. ఒక ఆరు నెలల్లోనే వైశాలి జీవితం ముగిసింది.

తెలిసీ తెలియని వయసులో వున్న రేష్మకు తల్లి మరణం పెద్దగా బాధపెట్టలేదు.

వైశాలి తనకన్నా పదిసంవత్సరాలు చిన్న అయిన ఆఖరి చెల్లెలు చందనకు చిన్నతనంనుంచి అనేక విషయాలు చెప్పేది. వయసుకు మించిన పరిణితితో పెరిగింది చందన. దాంతో అక్కలేదన్న బాధను పైకి వ్యక్తం చేయలేదు. తన అక్క కోరుకున్న విధంగానే రేష్మ జీవితం సాగాలనుకుంది.

ఒకపక్క తన చదువు, రేష్మ బాధ్యతలతో క్షణం తీరిక ఉండేది కాదు చందనకు. ఎం.బి.ఎ మంచి మార్కులతో పాసైంది. మంచి కంపెనీ లో ఉద్యోగం సంపాదించుకుంది.

"నా వయసు పెరుగుతోంది. ముసల్దాన్ని అయిపోతున్నాను. నేను బతికి ఉండగానే నిన్ను ఒక అయ్య చేతిలో పెట్టాలి. ఇంకా ఎంత కాలం అలా ఉంటావు" అంది చందన తల్లి.

తెలిసిన వాళ్ళందరినీ అడిగింది తన కూతురుకు మంచి సంబంధం ఉంటే చెప్పండి అని.

చందన రూపు, చదువు, ఉద్యోగం చూసి చాలామంది అబ్బాయిలు ఇష్టపడ్డారు. కానీ తాంబూలాలు పుచ్చుకునేవరకు వచ్చి వెనక్కి తగ్గేవారు.

చందన అన్నయ్య హెచ్ఐవి రిపోర్టులు కూడా మగపెళ్ళివారికి ఇచ్చేవాడు. అయినా ఎవరూ ముందుకు రాలేదు.

దానికి కారణం చందన అక్క జీవితం.

ఎంతధైర్యంగా ఉన్నా చందన స్త్రీత్వం కొంచెం బాధపడింది.సిగ్గుపడింది.

“ఈ సమాజాన్ని ఎవరూ మార్చలేరా? రిపోర్టులు కూడా నమ్మకం కలిగించలేవా? కుటుంబంలో ఒక వ్యక్తి అనారోగ్యంగా ఉంటే మిగతా కుటుంబ సభ్యులందరూ శిక్ష అనుభవించాలా?” అనుకొనేది.

చందనకి మాటలు కరువయ్యాయి.మనసులో ఎడతెగని ఆలోచనలు. ఏదో చేయాలనే కసి, పట్టుదల రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

కొంతకాలం తన పెళ్ళి ప్రస్తావన తీసుకురావద్దని అమ్మకి చెప్పింది. ఆ తరువాత 'హెచ్ఐవి పాజిటివర్స్ క్లబ్'లో వాలంటీర్‌గా చేరి వారికి తోడ్పాటును అందిస్తోంది.

ఇతర విషయాల వైపు దృష్టి మరలకుండా ఆఫీసు, క్లబ్‌లలోనే ఎక్కువ కాలం గడుపుతోంది చందన.

చందనకి మాటలు కరువయ్యాయి. మనసులో ఎడతెగని ఆలోచనలు. ఏదో చేయాలనే కసి, పట్టుదల రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కొంతకాలం తన పెళ్ళి ప్రస్తావన తీసుకురావద్దని అమ్మకి చెప్పింది. ఆ తరువాత 'హెచ్ఐవి పాజిటివర్స్ క్లబ్'లో వాలంటీర్‌గా చేరి వారికి తోడ్పాటును అందిస్తోంది.

** ** **

అక్క జ్ఞాపకాల్ని తలుచుకున్న చందన దుఃఖిత అయ్యింది. మనస్సు చెదల పుట్ట అయింది.

చందన గతం విన్న శిల్ప అవాక్కయింది.

“అక్కా! ఇంత బాధను ఎలా తట్టుకుంటున్నావు” అని అడిగింది.

“ఇందులో బాధేముంది శిల్పా... జీవితం ఇలా ఉంది... అయినా కాలమే అన్నిటికీ సమాధానం చెబుతుంది. మనం చేయగలిగేదే మిటంటే ఎటువంటి సమస్యనయినా ఎదుర్కోవడానికి తగిన ధైర్యాన్ని సంతరించుకోవాలి. మా అక్క నీకు మల్లే బాధపడుతూ కూర్చుంటే బంగారం బొమ్మలాంటి రేష్మ ఉండేదా?” అంది చందన.

శిల్ప మౌనం వహించింది.

మళ్ళీ చందనే చెప్పడం ఆరంభించింది.


“నువ్వు ధైర్యంగా ఉండు శిల్పా... నువ్వు ఆరోగ్యంగా కనిపిస్తున్నావు. ఆరోగ్యంగానే ఉంటావు. నీకు హెచ్ఐవి ఉందని తేలిందేగాని ఇప్పట్లో నీకేం కాదు... నువ్వు చదువుకున్నదానివి. నువ్వు ధైర్యంగా ఉంటే ఇక్కడ నీ చుట్టూ ఉన్నవాళ్ళు మరింత ధైర్యంగా ఉంటారు. అందుకే నీ కంట కన్నీరు కనిపించకూడదు... నిబ్బరంగా ఉండాలి” ఆమె తల మీద చేతులు వేసి నిమురుతూ చెప్పింది.

చందన స్పర్శ, లాలన శిల్పకి ఓదార్పునీ, ధైర్యాన్నీ ఇచ్చాయి.

“అవును. ఇప్పటి నుంచి నా కంట కన్నీరు రానివ్వను. రేపటినుంచి నువ్వే చూస్తావు నాలో వచ్చిన మార్పును” అంది శిల్ప.

గతాన్ని తలుచుకున్నందుకు తాను కొంచెం కలత చెందినా, శిల్పలో ధైర్యాన్ని కలిగించినందుకు సంతోషపడింది చందన.

** ** **



చందన ఇంటికి వచ్చేసరికి రాత్రి పది అయింది.

ఫ్రెషప్ అయి, డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంది భోజ నం చేయడానికి.

అంతవరకు హాల్లో టివి చూస్తున్న చందన అన్నయ్య డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి చందన ఎదురుగా కూర్చున్నాడు.

“అమ్మా చందనా! సాయంత్రం అభిరామ్ వచ్చాడు” అన్నాడు.

“దేనికి”

“నీకు ఇష్టమయితే నీతో జీవితాన్ని పంచుకోవటానికి తనకు అభ్యంతరం లేదన్నాడు”

“గతంలోనూ అలాగే అన్నాడు, మళ్ళీ వంశగౌరవం అంటూ వాళ్ళ అమ్మానాన్నలు అడ్డు చెప్పడంతో కాదనలేకపోయాడు! ఇప్పుడు మళ్ళీ ఆ ప్రస్తావన తీసుకురావడం, వాళ్ళ అమ్మానాన్నలు వద్దు అనడం దేనికి” అంది చందన.

గతంలో చందనను చూసిన పెళ్ళికొడుకుల్లో అభిరామ్ ఒకడు.

పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు ముందుగా తన అక్క గురించి, అక్క కూతురు రేష్మ తనతోనే ఉంటుందన్న విషయం అతనికి చెప్పింది చందన.

తన అక్కకు జరిగిన అన్యాయం తనకు జరగకూడదని, తన హెచ్ఐవి రిపోర్టు ఇస్తూ, అభిరామ్‌ను హెచ్ఐవి రిపోర్ట్ తీసుకురమ్మంది.

“నన్ను అపార్థం చేసుకోకండి. జీవితంలో ముఖ్యమైన విషయాల్లో నిర్ణయం తీసుకోవడం కాస్త ముందు వెనక అవడంవల్ల భవిష్యత్తులో పరిణామాలు చాలా విపరీతంగా వుంటాయి. చాలా జాగ్రత్తగా ఆలోచించండి.” అంది చందన.

“మీరు అనేది ఏమిటి? నామీద, నా ఆరోగ్యం మీద అంత నమ్మకం లేదా?” అన్నాడు అభిరామ్.

“ఇక్కడ నమ్మకం కాదు ప్రధానం. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకూడదన్నదే నా ఆరాటం. నా జీవితం కూడా అక్క జీవితంలా అయితే నావాళ్ళు తట్టుకోలేరు”అంది చందన.

ఇంటికి వెళ్ళిన అభిరామ్ చందనకు, తనకు మధ్య జరిగిన సంభాషణను తల్లి దండ్రులకు చెప్పాడు.

“ఆడపిల్ల అలా మాట్లాడటం ఏమిటి? పెళ్ళికి ముందే ఇటువంటి షరతులు పెడితే పెళ్ళి అయ్యాకఎలా ఉంటుందో? ఈ సంబంధం వద్దు”అని తల్లిదండ్రులు అనడంతో తిరిగి సమాధానం చెప్పలేదు.

మళ్ళీ ఇన్ని రోజులకు తన హెచ్ఐవి రిపోర్ట్ తీసు కుని చందన అన్నయ్యను కలిశాడు అభిరామ్.

“రేపు ఉదయమే ఫోన్ చేస్తానన్నాడు. అతనికి ఏం చెప్పమంటావు?” అని అడిగాడు చందన అన్నయ్య.

“వద్దన్నయ్యా, ఇంకేమీ చెప్పొద్దు... నా దగ్గర ఇప్పుడిప్పుడే పెళ్ళి ప్రస్తావనలు చేయకు” అంటూ భోజనం ముగించి లేచి వెళ్ళిపోయింది.

** ** **

మర్నాడు సాయంత్రం పాజిటివ్ క్లబ్‌లో శిల్పతో మాట్లాడుతూ కూర్చున్న చందనకి దూరం నుంచి వస్తున్న అభిరామ్ కనిపించాడు.

తన కోసం ఇక్కడికి వస్తున్నాడేమిటా అనుకుంది.

అతడు దగ్గరకు వచ్చి “హలో బావున్నారా” అంటూ విష్ చేశాడు.

తను విష్ చేసి కూర్చోమన్నట్టుగా కుర్చీ చూపించింది.

తర్వాత అతనికి శిల్పని పరిచయం చేసింది.

కాస్సేపు పాజిటివ్ క్లబ్ గురించి అడిగాడు. క్లబ్ కార్యకలాపాల గురించి చెప్పింది చందన.

ఆసక్తిగా విన్నాడు అభిరామ్.

అతని మాటల్లో వేగిరపాటు లేదు. కొత్త మనిషితో మాట్లాడుతున్నట్టుగానూ లేదు. చాలా సహజంగా అక్కడికి వచ్చి స్నేహంగా పల కరిస్తున్నట్టుగా తోచింది.

కాస్సేపటి తర్వాత శిల్పకి 'బై' చెప్పి ఇద్దరూ బయటికి వచ్చారు. తన బండి దగ్గరికి వెళ్ళబోతూ “చెప్పండి” అంది చందన.

“నాలుగు నెలలుగా మిమ్మల్ని ఎంత మిస్సయ్యానో ఇప్పుడు బాగా తెలుస్తుంది.”

ఆ మాటలకి ప్రశ్నార్థకంగా చూసింది అతనివైపు.

“మీతో పాటు రోజూ ఇలా రావాలనుంది... మీరు అనుమతిస్తే... క్షణక్షణం మీతోనే ఉండాలనుంది.”

అతని గొంతులోని మార్దవానికీ, వేడికోలుకీ, నిర్ణయాత్మకతకీ విస్మయం చెందుతూ మౌనంగా తన బండివైపు నడిచింది.

ఆమె వెంట అతను నడిచాడు.

బండికి వున్న సేఫ్టీ లాక్ తీసి, తిరిగి తాళం వేసింది.

తలకి హెల్మెట్ పెట్టుకుంది. అద్దం పైకెత్తింది.

“సరే, రేపు కలుద్దాం...” అంది నవ్వే కళ్ళతో.